# స్వాధీన మృత్యువు

నరసయ్యగారు ఎప్పుడూ మల్లెపూవులా అందంగా ఆకర్ష ణీయంగా, సుకుమారంగా కన్పించేవారు. ఆరోగ్యానికి ఆరోగ్యం, ఐశ్వర్యానికి ఐశ్వర్యం అధికాధికంగా కల అదృష్టవంతుడాయన. మనిషి చక్కని నిండైన విగ్రహం. చిన్నప్పుడే కాదు నలభై ఏళ్లు దాటిన తర్వాత కూడా వ్యాయామం చేసిన మనిషి ఆయన. ఆయన చాలా కాలం రాజా నరసింహదేవవర్మగారి దగ్గర కొలువు చేశారు. ఆయన పూర్వీలు సంపాదించిన ఆస్తి రెండింతలు అయింది. ఆయన ఎప్పుడూ చిరునవ్వు నవ్వుతూ హాస్యోక్తులాడి అందరినీ నవ్విస్తూ ఉండేవారు. ఆయన మహా విద్వాంసుడని కొద్దిమందికే తెలుసు. ఆయన మంత్ర శాస్త్రవేత్త అని ఆయన సన్నిహితులలో కూడా ఎక్కువ మందికి తెలియదు.

ఆయన మనసు నవనీత సమానమైనది.

స్వయంగా కష్టమన్నది ఎరుగ రాయన. ఇతరుల కష్టం చూడలే డాయన. ఎవరిదాకానో ఎందుకు ఆయన భార్య ఆరు నెలలు నిండి నప్పటినుంచీ కొంచెం ఆపసోపాలు పడుతున్నట్లు కన్పించేసరికి ఆయన క్రిందా మీదా అయిపోయారు. ఆవిడను పుట్టింటికి పంపి, పుట్టే బిడ్డకు ఏడాది నిండేదాకా తిరిగి పంపవద్దని అత్తమామలకు కబురుపెట్టాడు. అప్పుడే కాదు– ఆ తర్వాత రెండు పురుళ్లకు కూడా ఆవిడ పుట్టింటికే వెళ్ళింది. ఇద్దరు మొగపిల్లలూ, ఒక ఆడపిల్లా కలిగాక ఇక పిల్లలు చాలుననుకొన్నా రాయన. భార్య బలహీనంగా కన్పించడమే అందుకు కారణం. అందుకు ఏ విధమైన చికిత్స చేయించుకోలేదు. వైద్యాల

యానికి వెళ్లడం అంటేనే ఆయనకు గిట్టదు. తను వెళ్లరు. మరొకర్ని వెళ్లనీయరు. ఆ అవసరం లేకుండానే ఆయనకు గడిచింది. ఒకసారి నిర్ణయం చేసుకొన్నాక ఆయనకు మరి సంతానం కలుగలేదు.

నరసయ్యగారు బహుళంగా దేశాటన చేశారు. దేశంలో ఆయన చూడని అరణ్యం లేదు అందులోనూ పర్వతాలపై పెరిగిన అరణ్యాలంటే ఆయనకు మక్కువ ఎక్కువ. పర్వతాగ్రాలపైకి వెళ్లి ప్రకృతి సౌందర్యాన్ని ఎన్నోసార్లు సందర్శించారు. ఆయనకు ఎన్నటికీ తనివి తీరలేదు. రాజా నరసింహదేవ వర్మగారు వేటకు వెళితే ఆయనవెంట వెళ్లేవారాయన. రాజాగారు మృగయాసక్తులు. అయితే ఆయన మృగ సందర్శనాసక్తులని అందరూ చెప్పుకొనేవారు.

ఆయన ఒకసారి రాజాగారితో కలిసి అనంతగిరి వెళ్లారు. శృంగవరపుకోట దాటినప్పటినుంచీ ఆయన కళ్లు పెద్దవి చేసుకొని నలుదిక్కులా చూడడం మొదలుపెట్టారు. ఇక ఆ తర్వాత ఆయన రెప్పవాల్చలేదనుకొన్నారంతా. గాలి పర్వతం దగ్గర కొండదేవరకు మ్రొక్కడానికి కొంతసేపు ఆగమంటే ఆయన నవ్వుతూ 'ఇక్కడ ఒకచోట ఏమిటి దారిపొడుగూతా అడుగు అడుగునా ఇలా ఆగమన్నా ఆగుతాను' అన్నారు. ఆయన్ను ముందుకు తీసుకొనివెళ్లడం కష్టమై పోయింది. కొండలు ఎక్కి దిగాలి. కొంతదూరం లోయలవెంట నడిచి మళ్లీ కొండ ఎక్కాలి. దారి పొడుగూతా దట్టమైన అడవి. అనంతగిరి వెళ్లేదాకా ప్రతి కొండపైనా ఆగి, నలుగుర్నీ ఆపి 'అదుగో అటు చూడండి. ఆ దృశ్యం ఎంత బాగున్నదో. ఆ చెట్ల మధ్యగా ప్రవహిస్తున్న వాగు వంక చూడండి. ఇటు ఈ విశాలమైన పర్వత సానువువంక చూడండి. మేఘాలువచ్చి విశ్రాంతి తీసుకొంటున్నాయి అక్కడ' అంటూనే ఉన్నారు.

అనంతగిరి వెళ్లేలోపల అయిదారు చోట్ల నరసయ్యగారు ఆగి నలువైపులా చూస్తూ ఉండిపోయారు.

నలువైపులనుంచీ గదుముకొని వస్తున్నట్లున్న ఎత్తయిన, విశాలమైన పర్వతాలు. పర్వతాలను సర్వత్రా ఆక్రమించిన అరణ్యాలు. కొంతదూరం పైకి వెళ్లి, వచ్చిన బాట ప్రక్కగా కొనను నిలబడి క్రిందకు చూస్తే అగాధం. లోయలు. లోయలలో రకరకాల వృక్షాలు వరుసలుగావేసి పెంచినట్లున్న ఎత్తైన టేకుచెట్లు. ఎక్కడ చూచినా మామిళ్లు. ఏపుగా విశాలంగా పెరిగిన చింతచెట్లు. మధ్య మధ్య పలురకాల ఫలవృక్షాలు లోయలకు ఆవల దూరంగా పర్వతాలు. అవి సౌందర్యరాసులు. సన్నగా మంచు పడుతున్నది. ఉన్నట్లుండి దట్టమైన మేఘాలు ఒకవైపునుంచి క్రమ్ముకొని వస్తున్నాయి. విశాలంగా పరచుకొన్న మబ్బులపై కన్పించీ కన్పించని కదలికలు. అటునుంచి చల్లటిగాలి అలలు అలలుగా మెల్లగా వీచింది. క్రింద లోయలలో చీకట్ల రాసులు. పైన కొండలపైకి దిగి వస్తున్నట్లున్న సూర్యుడు. చీకట్ల రాసులపై సూర్యకిరణాల జల్లులు. మబ్బులు- కాంతులు. మాయతొలగి జ్ఞానోదయం కలిగినట్లు అనిపిస్తున్నది పర్వతాలపైనుంచి మహా ఆర్భాటంగా పడిపోయినట్లు ప్రవహిస్తున్న సెలయేర్లు. సెలయేటిహోరు. ఏటిహోరుకు మారు పలుకుతూ పక్షుల కలకూజితాలు. ఇంత అందాన్ని వెక్కిరిస్తున్నట్లు కోతుల ఇకిలింతలు, కిచకిచలు. అంత ఎత్తున చెట్ల కొమ్మలనుంచి ఢభీమని క్రింద పడుతున్నాయి ఎలుగుబంట్లు. పెద్ద నల్లరేగడి మట్టిబెళ్లలు విరిగిపడ్డట్లు పడుతున్నాయి అవి. అంతలో అవి లేచి దులపరించుకొని పోతున్నాయి. రకరకాల పక్షులు గుంపులు గుంపులుగా వచ్చి బాటలమధ్య కొలువుతీర్చి కొంచెం చప్పుడు అయితే అన్నీ కలిసి లేచి ఎగిరి పోతున్నాయి. ఎటు చూచినా గుబురులు గుబురులుగా పెరిగిన పూలమొక్కలు. లతానికుంజాలు వాటిపై గుత్తులు

గుత్తులుగా వికసించిన పూలు. ఎగచిమ్ముతున్న పరిమళం. వెనుతిరిగి చూస్తేచాలు ఎన్నెన్నో మధురస్మృతులు. ఆ పర్వతాలకు దూరంగా పోయినకొద్దీ అవి మరీ నవనవలు పోతున్నాయి. వాటికి దగ్గరకు వచ్చినకొద్దీ అవి వింత వింత విలాసాలు పోతున్నాయి. ప్రకృతి నవనవోన్మేషంగా కన్పించింది. ఆయన మనసు నూత్నానందంచే జాగరితం అయింది. ఆయన హృదయం నవనవానంద భరితం అయింది.

అనంతగిరి వెళ్లేసరికి సాయంత్రం నాలుగు గంటలు అయింది. వారంతా బంగ్లాలో విడిది చేశారు. ఆరుబయట కూర్చుని సేవకులు అందిస్తున్న చల్లని, తీయని పానీయాలు సేవిస్తూ రాజాగారు నరసయ్య గారితో సంభాషణ జరిపారు. నరసయ్యగారు ఆ పర్వత ప్రాంతాల ప్రకృతి రామణీయకతను వేనోళ్ల కొనియాడారు. ఆయన చివరకు 'బ్రతికినా ఇల్లాంటి చోట బ్రతకాలి. మామూలు బ్రతుకుకే కాదు-తపస్సు చేసుకోడానికి కూడా ఇది అనువుగా ఉన్నది. అంతేకాదు-నాకు తనువు చాలించినా ఇక్కడే చాలించాలని ఉన్నది. ఇంత అందమైన, ఇంత స్వచ్ఛమైన ప్రదేశం మరొకటి లేదు' అన్నారు.

'ఏం అలా అన్నారు?' అని అడిగారు రాజాగారు. అందుకు నరసయ్యగారు 'దేశంలో క్రమంగా నాగరకత బలిసిపోతున్నది. మనుషుల జవసత్త్వాలలో మార్పు వస్తున్నది. పట్టణాలు పెరిగి పోతున్నాయి. నగరాలలో మురికి పేరుకొంటున్నది. రకరకాల రోగాలు వస్తున్నాయి. ఆ మురికి కూపంలో ఉంటూ ఏదైనా రోగం వస్తే వైద్యం చేయించుకొని, కుదరక, వ్యాధి ముదిరి చచ్చేకంటే, చావు రానున్నప్పుడు ఇలా స్వచ్ఛంగా, హాయిగా స్వేచ్ఛగా ఉండే ప్రదేశంలో ఈ చెట్లమధ్య ముక్కు మూసుకొని హరీ అంటే అంతకంటె కావలసిందేముంటుంది?' అన్నారు.

రాజాగారు కొంచెం భయపడ్డారు. పైకి మాత్రం నవ్వి ఊరుకొన్నారు. కొన్ని నిముషాల తర్వాత మాట మార్చారు.

ఆ మరునాడు వేటకు అన్ని ఏర్పాట్లూ జరిగాయి.

మాటుపెట్టి పులికోసం ఎదురుచూస్తున్న సమయంలో కొందరు సేవకులు వచ్చి నరసయ్యగారు అక్కడెక్కడా కన్పించడం లేదన్నారు. నలుగురూ నాలుగు వైపులకు వెళ్లి వెతికారు. రాజాగారు కూడా కొంతమంది సేవకులను, భిల్లులను వెంటపెట్టుకొని ఒక వైపుకు బయలుదేరారు.

పులి నడిచి వెళ్లిన బాట కన్పించింది. వారంతా ఆ బాట వెంట రెండు ఫర్లాంగుల దూరం వెళ్లారు.

రాజాగారు అల్లంతదూరంలో ఆగిపోయారు.

ఎదురుగా నీటిమడుగు. దానివెనుక దట్టమైన చెట్టు చేమలతో కప్పిఉన్న ఎత్తైన పర్వతం. దానిముందు కొంత మేర చదునుచేసి, ఇసుక పరచినట్లున్నది. నరసయ్యగారు ఆ మడుగులో స్నానంచేసి, ఒడ్డున ఇసుకమీద నిలబడి తడిగుడ్డలతో సూర్యునివైపు తిరిగి నమస్కారం చేస్తున్నారు.

ఆయనకు ఎదురుగా పులి నిలచి ఉన్నది.

పులిని చూడగానే అందరూ భయకంపితులు అయ్యారు. సేవకులు వెనుతిరిగి పారిపోవడానికి ప్రయత్నించారు. భిల్లులు ముందుకు వెళ్లి పులిని అదలించి తరిమివేయడానికి ఉద్యుక్తులు అయ్యారు. రాజాగారు వారిని అందరినీ వారించారు. నరసయ్యగారు కానీ, పులికానీ వీరిని ఎవరినీ చూడలేదు. పదినిముషాల తర్వాత నరసయ్యగారు పెద్దగా 'ఇంక నువ్వు వెళ్లి నీళ్లు త్రాగు' అన్నారు. అలా అంటూ ఆయన చేత్తో

సంజ్ఞకూడా చేశారు. పులి కదిలింది. అది నెమ్మదిగా అడుగులో అడుగు వేసుకొంటూ అటు మడుగువైపుకు వెళుతున్నది. నరసయ్యగారు వెనుతిరిగి ఇటు హుందాగా వస్తున్నారు.

రాజాగారు ఆయనవంక అలా చూస్తూ ఉండిపోయారు. నరసయ్య గారు దగ్గరకు వచ్చాక నలుగురూ ఆయన్ను చుట్టుముట్టారు. అలా ఎలా జరిగింది అని ప్రశ్నించారు. ఆయన రాజాగారి వంకకు తిరిగి 'రండి వెళదాం' అని ముందుకు నడిచారు. రాజాగారు ఆయన వెంట నడుస్తూ 'మనవాళ్లంతా ఏదో అడుగుతున్నారు, చెప్పకూడదూ' అన్నారు. 'స్నానానికి వెళ్లాను. అదీ వచ్చింది నాకు ఎదురుగా. పులికూడా ఎంత అందమైన జంతువండీ. కొంతసేపు దానివంకే చూస్తూ నిలబడి పోయ్యాను. ఆ నీళ్లు ఎంతో శుచిగా కన్పించాయి. దాన్ని కొంచెంసేపు ఆగమన్నాను. ఆగింది. నా పని అయ్యాక దాన్ని వెళ్లి నీళ్లు తాగమని చెప్పి వచ్చాను. అంతే- అంతకంటె మరేంలేదు.' అన్నారు.

రాజాగారు భక్తిపూర్వకంగా ఆయనకు నమస్కరించారు. నరసయ్యగారు ఆయనను దీవించి, చిరునవ్వు నవ్వుతూ 'మీరు నమస్కరించవలసింది నాకు కాదు. ఇంతటి మహత్తరమైన, విచిత్రమైన, ఆనందదాయకమైన ప్రపంచాన్ని సృష్టించినవానికి కృతజ్ఞతాపూర్వకంగా నమస్కరించాలి.' అన్నారు.

*　　　*　　　*

'రక్తపు పోటువస్తే మందు పుచ్చుకోవాలండీ, మీకు ఇంగ్లీషు మందు పనికిరాకపోతే తెలుగుమందు పుచ్చుకోండి. ఆయుర్వేద వైద్యుణ్ణి పిలిపిస్తాను. ఒక ప్రక్కకు తూలిపోతున్నారటగా. ఇలా అశ్రద్ధ చెయ్యటం మంచిది కాదు' అన్నారు రాజాగారు ఒకసారి నరసయ్యతో.

అందుకు నరసయ్యగారు నవ్వుతూ "షుమారు నెలరోజుల క్రిందట మీ దివాణంలో ఒకసారి తూలిపడినమాట వాస్తవమే. అందువల్లనే డాక్టరు రావటం, నన్ను పరీక్షించి మందులు వ్రాసి ఇవ్వడం జరిగింది. ఆ మందులు పుచ్చుకొంటూ పూర్తిగా విశ్రాంతి తీసుకోకపోతే చచ్చిపోతానని కూడా హెచ్చరించారు. ఇంటికి జాగ్రత్తగా వెళ్లమన్నారు ఆ రోజు నాకు వాహనయోగం ఉన్నది. అలా వెళ్లేసరికి అంతా గాభరాపడ్డారు. వీధిలో బంధు మిత్రులంతా వచ్చి పరామర్శించి వెళ్లారు. వాళ్లూ ఆ మాటే అన్నారు. అప్పుడు నేను ఒక్క మాట అన్నాను. 'అంతా అంటున్నారని చచ్చిపోతానా. మళ్లీ నెలకు రండి ఆ వ్యవహార మేదో చూద్దాం' అన్నాను. మందితో వ్యవహారం, మరి జాగ్రత్తగా పరిష్కరించవలసి ఉన్నది" అన్నారు. అందుకు రాజాగారు నవ్వుతూ "అయితే మరి ఇప్పుడు తూలడం లేదా ?" అన్నారు.

"లేదు. ఆ రోజునుంచి ఈరోజు వరకూ తూలడం లేదు. రోజూ ఉదయం రెండు పెద్ద బకెట్లనిండా నీళ్లు మోసుకొని వెళ్లి చెట్లకు పోస్తున్నాను. రెండు చేతుల్లో సమానమైన బరువు ఉంటే ఎటూ తూలడం లేదు" అన్నారు నరసయ్యగారు. "అది సరే ఇప్పుడెలా ఉన్నదో, జబ్బు ఎలా తగ్గిందో చెప్పరేం" అని రాజాగారు అడిగితే నరసయ్యగారు "రోజూ వ్యాయామం చేస్తున్నాను. పూర్వంకంటె ఎక్కువగా దండాలూ, బస్కీలూ తీస్తున్నాను. దాంతో రోగానికి రోగం కుదిరింది" అన్నారు. అందుకు రాజాగారు సంతోషిస్తూ 'చాలా సంతోషం' అన్నారు. అందుకు నరసయ్యగారు నిట్టూర్పు విడుస్తూ 'అలా అన్నారు బాగుంది. రాజ వైద్యుడూ, మీ పాలితులూ అన్నమాట అబద్ధం అయినందుకు కోపం రాలేదు. నాకు కొన్నాళ్లుగా అదొక భయంగా ఉన్నది' అన్నారు.

కొంతసేపు తర్వాత నరసయ్యగారు లేచి నిలబడి 'మరి నాకు సెలవు. నేను త్వరలో స్వస్థలానికి వెళ్లాలని అనుకొంటున్నాను. ఆ ఏర్పాట్లు చేసుకొంటాను. అనుమతి ఇప్పించండి. అటు వెళ్లి మళ్లీ ఇటు రానేమో. అలా అనిపిస్తున్నది' అన్నారు.

రాజాగారికి ఎడమకన్ను ఎక్కువగా అదరడం మొదలుపెట్టింది. నరనయ్యగారి మాటల ధోరణి ఆయనకు నచ్చలేదు. 'అవును అనంతగిరి వెళ్లినప్పుడు కూడా ఆయన మాటల ధోరణి అదోలా ఉన్నది' అనుకొన్నారాయన. నరసయ్యగారిని ఉండమన్నారు. తనదీ, నరసయ్యగారిదీ జాతక చక్రాలు తెప్పించి, జ్యోతిష్కులను పిలిపించి జాగ్రత్తగా పరిశీలించి, భవిష్యత్తు ఎలా ఉన్నదో చెప్పమన్నారు. జ్యోతిష్కులు నరసయ్యగారి జాతకం పరిశీలించి ఆయనకు పెద్దపులిలా భయపెట్టే వ్యాధి ఒకటి కన్పించిందనీ, అయితే అది చల్లగా జారుకొన్నదనీ, రాబోయే ఐదు సంవత్సరాలలో ఆయనకు రాజయోగం పట్టనున్నదనీ, ఆయన దృష్టి పూర్తిగా భగవంతునిపైకి మరలుతుందనీ చెప్పారు. రాజాగారికి ఎడమకన్ను మరీ ఎక్కువగా అదిరింది ఆయన భయపడుతూ తన విషయం చెప్పమన్నారు. జ్యోస్యులు పరిశీలన తర్వాత 'మీకు పూర్వంలాగే ముందుకూడా సుఖంగా గడచిపోతుంది. విశేషం ఏమీ లేదు' అన్నారు. నరసయ్యగారు ఆ మాటలు విని, నవ్వి, జోస్యులను నెమ్మదిగా పంపించివేసి, రెండు జాతక చక్రాలనూ పరిశీలించి 'అయ్యా, వారు చెప్పింది నిజమే. చెప్పని విషయాలు నేను చెప్పుకొంటాను. వారికి లేని ధైర్యం, చనువు నాకు ఉన్నాయి. త్వరలో మీ సంస్థానం పోతుంది. మహానగరాలలో ఉంటూ ఇతర రాకుమారుల లాగానే ధనం విచ్చలవిడిగా ఖర్చుపెడుతున్న మీ కుమారులను పిలిపించి బాధ్యత వప్పగించండి. మనం ఇంతకుముందే- చాలాకాలం క్రిందటనే కొన్ని ఏర్పాట్లు చేశాం. వాటివల్ల మంచి ఆదాయం వస్తుంది.

అవసరమైన మేరకు, వీలుపడినంతవరకు ముందుగా జాగ్రత్త పడండి. తర్వాత మీ తరంవారిని ముందు తరాలవారు జ్ఞాపకం ఉంచుకొనేలా ఉత్తమ కార్యాలు చెయ్యండి. ఉదాత్తమైన విధంగా దాన ధర్మాలు చెయ్యండి. ఇక నా విషయం. నాకు స్థానచలనం ఉన్నది. ప్రయాణ సన్నాహాలు చేసుకోక తప్పదు. రాబోయే అయిదు సంవత్సరాలూ నిశ్చింతగా గడుస్తాయి. అయితే మన జోస్యులు చెప్పినట్లుగా నాకు రాజయోగం లేదు. కాని అయిదు సంవత్సరాల తర్వాత రాజులకు మాత్రమే సంక్రమించే దేదో నాకు సంక్రమించవచ్చు' అన్నారు నవ్వుతూ.

రాజాగారు చప్పున లేచి నిలబడి 'హాస్యానికైనా హద్దు ఉండాలి. కొన్నాళ్లుగా మీ మాటల ధోరణి బాగా లేదు. మీరు ఇలా అనకూడదు. నాకు ఎడమ కన్ను అదురుతున్నది అందుకే మన జాతకాలు చూపించాను. సరే జరిగిందానికి చింతించి ప్రయోజనం లేదు. మీరు కొంతకాలం విశ్రాంతి తీసుకోండి' అన్నారు ఆయన ముఖంలో కొంచెం కోపంకూడా కన్పించింది ఆయనకు తనపట్ల ఎంత మైత్రీభావం ఉన్నదో నరసయ్యగారు గ్రహించారు. నరసయ్యగారు అనుకొన్నదానికంటె ఎక్కువ ప్రేమాభిమానాలు కన్పరిచారు రాజాగారు. నరసయ్యగారు ఆ ఊరినుంచి బయలుదేరి వెళ్లేరోజున రాజాగారు ఆయనకు పెద్దమొత్తంలో ధనం, బంగారునగలు, విలువైన ఆభరణాలు కాన్కగా పంపారు.

*　　　*　　　*

ఎంత మంది ఎన్ని చెప్పినా నరసయ్యగారు మందు పుచ్చుకో లేదు. ఆయనకు గట్టిగా చెప్పడానికి ఎవరికీ ధైర్యం చాలలేదు. రాజాగారి దగ్గర కొలువు మానుకొని వచ్చిన తర్వాత ఆయన యోగిలా కాలం

గడిపారు. కుటుంబ బాధ్యతలన్నీ ఆయన భార్య వహించవలసి వచ్చింది. ఆనాడు బలవంతంమీదనే వ్యాధి ఏమిటో తేల్చుకోడానికి ఒక్కసారి వైద్యాలయానికి వెళ్లారు. అక్కడి వైద్యులు పరీక్షించి అది పుట్టకురుపు వ్యాధి అనీ మందులు పుచ్చుకొని త్వరలో శస్త్ర చికిత్స చేయించుకొంటే నయం కావచ్చుననీ చెప్పారు అంతే, మళ్లీ ఆయన ఆ వైద్యాలయం ముఖం చూడలేదు. ఆయన భార్య బంధుమిత్రులతో చెప్పించింది. కాని ఆయన వినలేదు పైగా 'మీరెవరూ ఇంత ఇది కావలసిన పనిలేదు. ఇది కుదిరే వ్యాధికాదు. ఎలా జరగవలసి ఉన్నదో అలా జరగనివ్వండి. అయిదు సంవత్సరాల క్రితం రాజాగారితో ఒక సందర్భంలో రాజులకు వచ్చేదేదో నాకు రావచ్చునని చెప్పుకొన్నాను. అప్పుడు ఆయనకు కోపం కూడా వచ్చింది. మీ రెవరైనా ఆయనకు ఈ విషయం జ్ఞాపకం చేస్తే బాగుండు' అని నవ్వారు.

రాజాగారికి ఈ విషయాలన్నీ తెలిశాయి.

ఆయన కంట తడిపెట్టారు. వెంటనే నరసయ్యగారికి జాబు వ్రాశారు. 'మీరు విద్వాంసులు. తత్త్వవేత్తలు, శాస్త్రవేత్తలు. మాకు సన్నిహితులు, బహుకాలం మాకు సలహాదారులుగా ఉన్నారు. చాలా కాలం క్రిందటనే మీరు ముందు చూపుతో మా సంస్థానం పోయినా మా ఐశ్వర్యానికి లోటు రాకుండా ఉండేందుకు అనేక రకాల ఏర్పాట్లు చేశారు. వివిధ పెద్ద నగరాలలో కట్టించిన భవనాల మూలంగా అద్దెలు బాగా వస్తున్నాయి. తోటల ఆదాయం పెరిగింది మీరు మా పేరున ప్రారంభించిన వ్యాపారాలు మంచి అభివృద్ధిలోకి వచ్చాయి. ఇలా మాకు ఎంతో ఉపకారం జరిగింది. మా సంస్థానాన్ని ఇప్పుడు ప్రభుత్వం వశం చేసుకొన్నది. అయినా మాకు బెంగ లేకుండా ఉన్నది. భరణం ఎల్లాగూ వస్తున్నది. దానితో నిమిత్తం లేకుండానే క్షేమం పూర్వంలా

దర్జాగా గడుపవచ్చు. మీరు చాలా నవ్వులు కూడానూ. అందువల్ల పట్టుదలలకు పోకండి. వైద్యం చేయించుకోండి. మీరు ఇక్కడకు వస్తే ఇటునుంచి పట్నం వెళ్లి వైద్యం చేయించుకోవచ్చు. ఆ వ్యవహారం నేను చూస్తాను. ఆ విధంగా అయినా నాకు కొంత ఋణవిముక్తి కలుగుతుందేమోనని ఆశగా ఉన్నది. ఈ వ్యాధి మీకు రావలసింది కాదు. ఇది ముదిరినకొద్దీ బాధ ఎక్కువ. మీరు భరించలేరు. నా మాట వినండి. జనన మరణాలు మీవంటివారి దృష్టిలో సామాన్యమైనవి. మీరు వాటికి ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వరు. కాని ఉన్నంతకాలం శరీర రక్షణకై ప్రయత్నించడం తప్పు లేదు కదా. మీరు యోగశక్తి సంపన్నులు. ఇక్కడ కొందరికి మీరు అతి రహస్యంగా ఇటువంటి వ్యాధులే నయం చేశారట. వారిప్పుడు భగవద్భక్తులు అయ్యారు. పోనీ ఆ మార్గంలో మీ శరీరానికి కలుగుతున్న బాధ నివారించుకోండి. నామాట వినండి' అంటూ వివరంగా వ్రాశారాయన. కాని నరసయ్యగారు రాజాగారి మాటకూడా వినలేదు.

ఆయన దగ్గరనుంచి జాబు వచ్చినప్పటి నుంచీ ఇంట్లో పోరు ఎక్కువ అయింది 'మహాప్రభూ, నేను ఆ వైద్యాలయాలకు పోను. ఆ రకం వైద్యం చేయించుకోను. ఎలా జరగాలని ఉన్నదో అలా జరగనివ్వండి. ఉన్నన్నాళ్లు నన్నిలా ఉండనీయండి.' అంటూ భార్యను గదిమారు నరసయ్యగారు.

ఆయనకు బాధ క్రమంగా ఎక్కువ అయింది.

రెండు వారాలు గడిచాయి. ఆయన శరీరం బాగా కృశించి పోయింది. రాజాగారికి జాబు వ్రాయడానికి ఆయన భార్య ఆయనను అనుమతి కోరింది. ఆయన అనుమతించారు. రాజాగారు వెంటనే వస్తున్నట్లు వ్రాశారు. ఆయన దగ్గరనుంచి అలా ఉత్తరం వచ్చిన రోజున

ఉదయం నుంచి సాయంత్రం దాకా నరసయ్యగారు చాలా బాధపడ్డారు. అంతవరదాకా ఎవరిచేతా పరిచర్యలు చేయించుకోలేదు. భార్యను కూడా ఏ విధమైన పరిచర్య చెయ్యనీయ లేదు. కాని ఆ రోజు భార్యను దగ్గరకు పిలిచి బాధ ఎక్కువగా ఉన్నదని చెప్పి సకల ఉపచారాలూ చేయించుకొన్నారు. ఆ రాత్రి అంతా ఆయన మూలుగుతూనే ఉన్నారు. ఆ మరునాడు శనివారం.

ఆ రోజు నరసయ్యగారు ఉదయం నాలుగు గంటలకే నిద్ర లేచారు. గబగబా స్నానాదికాలు పూర్తి చేసుకొన్నారు. త్వరత్వరగా సంధ్యావందనం, పూజ పూర్తి చేసుకొన్నారు. ఆయన నవ్వుతూ తోటలోకి వెళ్లడం ఆయన భార్య చూచింది. ఆమె ఆశ్చర్యపడ్డది. 'ఇదేమిటి ఇంతలో ఇంత మార్పు వచ్చింది' అనుకొన్నది ఆవిడ.

నరసయ్యగారు నెమ్మదిగా తోటలోకి వెళ్లి మృగచర్మం పరుచుకొని, దానిపై పద్మాసనం వేసుకొని కూర్చున్నారు. అలా కూర్చుని ఆయన కళ్లు మూసుకొన్నారు.

అంతే ఆయన మళ్లీ కళ్లు తెరవలేదు.

ఆ పూట తొమ్మిది గంటలకు రాజాగారు హడావిడిగా నరసయ్య గారింటికి వచ్చారు. నరసయ్యగారి భార్య ఆయనకు స్వాగతం చెప్పి, గాభరా పడవలసిం దేమీలేదని అన్నది. రాజాగారికి లోపల్లోపల ఏదో భయంగా ఉన్నది. నరసయ్యగారు తోటలో ఏకాంతంగా కూర్చుని ధ్యానం చేసుకొంటున్నారని విని ఆయన వచ్చేదాకా ఆగక, నెమ్మదిగా అక్కడకు వెళ్లారు. ఆశ్చర్యపడుతూ దూరంగా నిలబడ్డారు రాజాగారు. నరసయ్యగారు ధ్యాననిమగ్నులై ఉన్నట్లు కన్పించారు. కొన్ని నిముషాలు పరిశీలనగా చూచాక ఆయనకు అనుమానం కలిగి దగ్గరకు వెళ్లారు. అక్కడ ఎవరో స్పష్టంగా ఏదో మంత్రం ఉచ్చరిస్తున్నట్లు

అనిపించింది. ఆ వాతావరణం అంతా ఎంతో ప్రశాంతంగా, మంత్ర ప్రభావితంగా కన్పించింది. కొన్ని క్షణాల తర్వాత మంత్రోచ్చాటన ఆగిపోయినట్లు, ఆ వాతావరణం అంతా నిశ్శబ్దత ఆవరించినట్లు అనిపించింది. రాజాగారు నెమ్మదిగా ఆయన ముందుకు వెళ్లి పేరుపెట్టి పిలిచారు. ఆయన పలకలేదు. పైగా మనిషిలో ఎక్కడా ఏ కదలికా కన్పించలేదు. రాజాగారు నెమ్మదిగా ఆయన్ను స్పృశించారు. అప్పుడు తెలిసింది ఆయన శాశ్వతంగా కన్నుమూశారని.

నరసయ్యగారు కొద్ది నిముషాలక్రితం కావాలని కోరుకొనే అలా ప్రాణత్యాగం చేశారని అనిపించింది రాజాగారికి. 'యోగసాధన మూలంగా ఇది సాధ్యమే కదా. ఆయన స్వాధీన మృత్యువు.' అనుకొంటూ వెనుతిరిగి నెమ్మదిగా ఇంట్లోకి వెళ్లి అందరితో ఆ విషయం చెప్పారు.

రాజాగారు నరసయ్యగారికి దగ్గర ఉండి రాజమర్యాదలతో అంత్యక్రియలు జరిపించారు. ఆ సందర్భంగా ఎంతో మంది బ్రాహ్మణులను పిలిపించి పెద్ద ఎత్తున దానాలు చేశారు.

నరసయ్యగారి భార్యను ఎవరూ ఓదార్చలేకపోయారు. రాజాగారు కూడా ఆమెను ఓదార్చడానికి ప్రయత్నించి విఫలులు అయ్యారు. ఆయన వెళ్లిపోయేరోజున ఆవిడను పిలిచి 'అమ్మా, మీరు ఇలా దుఃఖపడి ప్రయోజనం లేదు. అంత స్వచ్ఛంగా, నిర్లిప్తంగా, అంత హాయిగా జీవితం గడిపిన మనిషికి ఇల్లాంటి కష్టం వచ్చింది. కర్మ అనండి, అదృష్టం బాగాలేక అనండి- రాకూడని జబ్బు వచ్చింది. అయితే అదృష్టం బాగా ఉన్నది కనుకనే ఎక్కువ బాధ పడకుండా వెళ్లిపోయారు. పులిని ఎదుట కావాలనుకొన్నంతసేపు నిలిపి ఉంచగలడు. కావాలనుకొంటే మృత్యువును కూడా వారించగల డాయన. ఇటువంటి

వ్యాధుతే వచ్చి మృత్యుముఖంలో చిక్కుకొన్న ఒకరిద్దరికి ఆయన మాకు ఎవరికీ తెలియకుండా తన శక్తి ధారపోసి వ్యాధి నయంచేసి, వారిని కాపాడారు. మమ్మల్ని అందర్నీ భక్తిమార్గంలో పెట్టడానికి ఆయన అలా చేశారని నాకు ఇప్పుడు తెలిసింది. కర్మ ఎలా ఉంటే అలా జరగనివ్వా లనుకొన్నారు. తన విషయంలో ఆయనకు అన్నీ తెలును. కనుకనే ఆయన ఇలా ప్రవర్తించారు. మీ కుటుంబానికి ఏ కొరతా రాకుండా నేను చూస్తాను' అన్నారు.

రాజాగారు స్వస్థలానికి వెళ్లిన తర్వాత కొంతమంది విద్వాంసులనూ, తత్త్వవేత్తలనూ పిలిపించి నరనయ్యగారి మరణం విషయంలో తనకు కలిగిన అభిప్రాయాలను గురించి చర్చించారు. ఫలితంగా ఆయన ప్రాణత్యాగం ధర్మసమ్మతమేనన్న అభిప్రాయం దృఢపడ్డది. 'అంత సునాయాసంగా, సుఖంగా ప్రాణం పోవటం కూడా గొప్ప అదృష్టమే. నాకూ అటువంటి అదృష్టం కలిగితే బాగుండును' అనుకొన్నారు రాజాగారు బాలాసార్లు.